andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.8 ; కనిష్ఠం 25.7

ఆంధ్రజ్యోతి

ఆదిలాబాద్
జిల్లా వార్తలు




గురువారం 18 ఏప్రిల్ 2024

- ఈనెల 22న జిల్లా పర్యటన ఖరారు
- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నామినేషన్‌కు రేవంత్‌రెడ్డి హాజరయ్యే అవకాశం
- పార్లమెంట్ స్థాయి ముఖ్యనేతలతో సమావేశం కానున్న సీఎం
- చేరికలపై ప్రత్యేకదృష్టి సారిస్తున్న పార్టీ నేతలు
- ఆదిలాబాద్ లోక్‌సభ స్థానంపై పట్టుబిగిస్తున్న కాంగ్రెస్
- సమీపిస్తున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రసవత్తరంగా రాజకీయాలు

22న జిల్లాకు.. సీఎం రాక



ఆదిలాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాకు రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాల ద్వారా తెలుస్తుంది. ఈ నెల 22న సీఎం జిల్లాలో పర్యటించే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి హోదాలో జిల్లాకు రావడం ఇది మూడోసారి. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత ఇంద్రవెల్లి అమరవీరులకు నివాళులర్పించిన సీఎం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఆ తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా అధికారిక కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చారు. మళ్లీ నెల రోజుల తర్వాత సీఎం జిల్లాకు రావడంతో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మొదటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లా పర్యటనను సెంటిమెంట్‌గా భావిస్తూ వస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా నుంచే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈసారి ఎలాగైనా ఆదిలాబాద్ లోక్‌సభ స్థానాన్ని దక్కించుకునేందుకు కాంగ్రెస్ పక్కాప్లాన్‌తో ముందుకెళ్లోంది. మునుపెన్నడూ లేనివిధంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు దీటుగా ఆదివాసీ మహిళా అభ్యర్థిని ఎన్నికల బరిలో నిలిపింది. ఎన్నికలకు ఇంకా 25 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉండడంతో పార్లమెంట్ స్థానంపై మరింత పట్టు బిగించేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు మొదలు పెట్టింది.



అభ్యర్థి నామినేషన్‌కు హాజరు

పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ నామినేషన్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యే అవకాశం కనిపిస్తుంది. ఇప్పటికే ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి జిల్లా కాంగ్రెస్ నేతలకు సమాచారం అందినట్లు తెలుస్తుంది. ఈ నెల 22న ఆత్రంసుగుణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి తన నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. ఆదివాసీల మద్దతును కూడగట్టేందుకే సీఎం జిల్లాలో పర్యటిస్తున్నారన్న ప్రచారం జరుగుతుంది. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఆదివాసీలే కావడంతో కాంగ్రెస్ మెజార్టీ ఓట్లను సాధించేందుకు ప్రయత్నాలు చేస్తుంది. అంతేకాకుండా గతంలో ఎన్నడూ లేని విధంగా లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి నామినేషన్‌కు సీఎం హాజరు కావడం ఇదే తొలిసారన్న ప్రచారం జరుగుతుంది. ముఖ్యమంత్రి జిల్లాకు రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ వర్గాలతో పాటు అధికార యంత్రాంగం అప్రమత్తమైనట్లు తెలుస్తుంది. అయితే ఒకటి, రెండు రోజుల్లో ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ అధికారికంగా ఖరారయ్యే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

నేతలకు దిశా నిర్దేశం

సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలకు దిశా నిర్దేశం చేయనున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల ముఖ్య నేతలు, ఇన్‌చార్జీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం కానున్నట్లు తెలుస్తుంది. లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, తీసుకోవాల్సిన చర్యలపై సీఎం కాంగ్రెస్ నేతలకు డైరెక్షన్ ఇవ్వనున్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గంలోనే గెలుపొందిన కాంగ్రెస్.. మిగితా నియోజకవర్గాలపై సీరియస్‌గా దృష్టిని సారిస్తోంది. నియోజకవర్గాల వారీగా నేతలతో చర్చించే అవకాశం ఉంది. బీజేపీ సిట్టింగ్ స్థానాన్ని ఈసారి తన ఖాతాల్లో వేసుకునేందుకు హస్తం పార్టీ అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. కొత్త, పాత నేతలందరినీ ఒకే తాటిపైకి తెచ్చి లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ అడుగులు వేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వంద రోజుల పాలన, ఆరు గ్యారంటీలను విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

ఆపరేషన్ ఆకర్ష్‌కు పదును

లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది కాంగ్రెస్ చేరికలపై ప్రత్యేక దృష్టిని సారిస్తుంది. దీంతో పార్టీని మరింతగా బలోపేతం చేయాలని భావిస్తుంది. ఇప్పటికే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో భారీగా చేరికలు జరుగుతున్నాయి. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి పలువురు ముఖ్యనేతలు, మాజీ ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మరికొంత మంది నేతలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. సీఎం పర్యటన సందర్భంగా భారీ చేరికలు ఉంటాయన్న ప్రచారం జరుగుతుంది. ఎవరు పార్టీలోకి వస్తామన్న అడ్డు చెప్పకుండా పార్టీలో చేర్చుకోవాలని అధిష్ఠానం ఆదేశంతో చేరికలు మరింతగా ఊపందుకుంటున్నాయి. కొంత మంది బీజేపీ, బీఆర్ఎస్ నేతలతో కాంగ్రెస్ సంప్రదింపులు జరుపుతోంది. మరికొంత మంది కౌన్సిలర్లు, జడ్పీటీసీలు, సీనియర్ నేతలు కాంగ్రెస్‌లో చేరే అవకాశం కనిపిస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇతర పార్టీల నేతలు అధికార పార్టీలో చేరేందుకు ఆసక్తి చూపడంతో కాంగ్రెస్‌కు కలిసి వస్తుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.



పట్టణంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు, మహిళలు

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం

- వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 17: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా సీతారాముల కల్యాణం కన్నులపండుగగా జరుపుకున్నారు. ఊరువాడల చలువ పందిళ్లను వేసి హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంలో భారీ ర్యాలీని నిర్వహించారు. పట్టణంలో వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చాందా(టి) కోదండ రామాలయం, రాంపూర్ రామాలయం, న్యూహౌజింగ్ బోర్డులోని శ్రీరామాంజనేయ ఆలయాలలో సీతారాముల కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలో యువకులు భారీ ర్యాలీలు నిర్వహించారు. పట్టణంలోని పలు వార్డుల గుండా రాముడి విగ్రహంతో శోభాయాత్ర నిర్వహించారు.

- ఈసారి శ్రీరామ నవమి ప్రత్యేకమైన రోజు : ఎమ్మెల్యే పాయల

జైనథ్ రూరల్: దేశంలోని అయోధ్యలో 500ఏళ్ల నాటి హిందువుల కల నెరవేరిందని ఈసారి శ్రీరామ నవమి హిందువు ప్రజలందరికీ ప్రత్యేకమైన రోజు అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా బుధవారం జైనథ్ మండలంలోని బోరజ్ శ్రీరామ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేద మంత్రాల మధ్య జరిగిన సీతారామ కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆదిలాబాద్ నియోజక వర్గ ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కె.రాందాస్, నాయకులు ముకుంద్‌రావ్, బోరజ్ మాజీ సర్పంచ్ మల్లారెడ్డిలతో పాటు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



బోరజ్‌లో సీతారామ కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల శంకర్

నామినేషన్లకు సర్వం సిద్ధం

- నేటి నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు
- కలెక్టరేట్‌లో ఆర్వో కార్యాలయం

ఆదిలాబాద్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. గురువారం నుంచి ఈనెల 25 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అభ్యర్థుల నామినేషన్లను స్వీకరించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. నామినేషన్ ఫారం-2ఏను రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి ఉచితంగా పొందవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆర్వో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. నేటి నుంచి 8 రోజుల పాటు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. సెలవు రోజు ఆదివారం మినహాయించి మిగితా అన్ని పని దినాలలో నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉంటుంది. ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల స్వీకరణకు చివరి గడువుగా నిర్ణయించారు. నిర్ణీత గడువు సమయంలోపు రిటర్నింగ్ అధికారి వద్దకు చేరుకున్న వారి నామినేషన్ పత్రాలను మాత్రమే స్వీకరించడం జరుగుతుందని స్పష్టం చేశారు. నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు కొమురంభీం చౌరస్తా నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు రోడ్డుకు ఇరువైపుల భారీ కేడ్లను ఏర్పాటు చేశారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఈ రోడ్డుమార్గం గుండా వెళ్లే రాకపోకలను నిలిపి వేయనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేయనున్నారు.



జిల్లాకేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం



కొమురంభీం చౌరస్తాలో రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి దారి

- నిబంధనలు ఇలా..

గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులకు 10 మంది ఓటర్లు ప్రతిపాదించాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఇటీవల మూడు నెలల లోపు దిగిన పాస్‌పోర్టు సైజు ఫొటో ఆఫిడవిట్‌పై అతికించాలి. నామినేషన్ పత్రంపై స్టాంపు సైజు ఫొటో అతికించాల్సి ఉంటుంది. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వేరే పార్లమెంట్ సెగ్మెంట్‌కు చెందిన వారైతే తప్పనిసరిగా వారి అసెంబ్లీ సెగ్మెంట్ ఈఆర్వో నుంచి ఓటరు ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. రిజిస్టర్డ్, గుర్తింపు పొందని పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ పారం లోని పార్ట్-3లో 'సి' కాలం ఎదురుగా ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తులలో ఏవైనా మూడు గుర్తులను ప్రాధాన్యతక్రమంలో ఎంపిక చేస్తూ వివరాలను పొందుపర్చాల్సి ఉంటుంది. అలాగే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా కొత్త బ్యాంకు అకౌంట్ వివరాలను అందజేయాలి. దీని ద్వారానే ఎన్నికల వ్యయానికి సంబంధించిన లావాదేవీలను చేపట్టాలి. అభ్యర్థులు గరిష్ఠంగా రూ.95 లక్షల వరకు ఎన్నికలలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులపై ఏమైనా క్రిమినల్ కేసులు ఉంటే నామినేషన్ పత్రంలోని పార్ట్-3 'ఏ'లో వాటి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి. దాఖలైనా నామినేషన్లను ఈనెల 26న పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 29 చివరి గడువుగా నిర్ణయించారు.

- ముహూర్తాల ఆధారంగానే..

ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. ముహూర్తాల ఆధారంగానే నామినేసన్ పత్రాలను దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈనెల 25 వరకు నామినేషన్ వేసేందుకు అవకాశం ఉన్నా.. సరైన ముహూర్తంలోనే నామినేషన్ వేసేందుకు మొగ్గు చూపుతున్నారు. బీజేపీ పార్టీ అభ్యర్థి గోడం నగేష్ ఈనెల 24న నామినేషన్ వేయనున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రంసుగుణ ఈ నెల 22న నామినేషన్ వేయనుండగా.. సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రంసక్కు ఈనెల 23 లేదా 24న, అలాగే మరికొంత మంది స్వంతంత్ర అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

నేటి నుంచి నామినేషన్లు : జిల్లా ఎన్నికల అధికారి

ఆదిలాబాద్ అర్బన్: 2024 పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 18నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజార్షిషా తెలిపారు. బుధవారం ఎస్పీతో కలిసి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 18నుంచి 25వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, 26న నామినేషన్ల స్క్రూట్రిని, 29 వరకు నామినేషన్ల ఉప సంహారణ గడువు ఉంటుందని పేర్కొన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు. జూన్ 6వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని తెలిపారు.

- ఏడు సెగ్మెంట్లలో ఓటర్లు

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజక వర్గంలో 7 సెగ్మెంట్లలో 1- సిర్పూర్, 5- ఆసిఫాబాద్, 6-ఖానాపూర్, 7- ఆదిలాబాద్, 8 - బోథ్, 9- నిర్మల్, 10- ముథోల్ ఉన్నాయని తెలిపారు. 7 నియోజక వర్గాలలో 16లక్షల 44 వేల 715 మంది ఓటర్లు, (పురుషులు 802575, మహిళలు 842054, ఇతరులు 86), సర్వీసు ఓటర్లు 2115 (పురుషులు 2085, మహిళలు 30) ఉన్నారని అన్నారు. ఇందులో 7 నియోజక వర్గాలకు గాను 2111 పోలింగ్ కేంద్రాలు, 88 సహాయక పోలింగ్ కేంద్రాలు మొత్తం 2199 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. పోలింగ్ సిబ్బంది 3891 మంది పీవోలకు ఏపీవో, ఓపీవోలు ఉన్నారని తెలిపారు. పోలీసు, ఇతరులు 1237 మొత్తం 5270 మంది ఉన్నారని వెల్లడించారు. మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించి పీవోలకు, ఏపీవో, ఓపీవోలకు శిక్షణ ఇవ్వడం జరిగిందని కలెక్టర్ పలు అంశాలపై పేర్కొన్నారు. జిల్లాలో ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీములు ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చి నగదు, మద్యం పంపిణీలు జరుగకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు.

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన : ఎస్పీ


ఎస్పీ గౌస్‌ఆలం మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో రూ.32,480,068, లిక్కర్ 2308.4 లీటర్లు, రూ.7,94,770, గాంజా 7,57,450 సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఎంసీఎంసీ, సర్వేలెన్స్ బృందాలను, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, వీడియో సర్వేలెన్స్ బృందాలను, ఎంసీఎంసీ కమిటీ, ఇతర కమిటీలు పని చేస్తున్నాయని, పోలింగ్ సిబ్బందికి రెండో విడత శిక్షణలో పోలింగ్ నిబంధనలు, మాక్ పోల్ నిర్వహించే విధానం,పోలింగ్ రోజు నిర్వర్తించవల్సిన విధులపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పిస్తామని ఎస్పీ పేర్కొన్నారు.



పులకించిన భద్రగిరి

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

- కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

● అగ్నిమాపక శాఖ అధికారి లింగు

ఉట్నూర్, ఏప్రిల్ 17: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఉట్నూర్ ఫైర్ స్టేషన్ అధికారులు, సిబ్బంది బుధవారం ఉట్నూర్ మండలంలోని కొమ్ముగూడతో పాటు ఉట్నూర్ మండలకేంద్రంలో గల జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ జాడి లింగు అన్నారు. అగ్ని ప్రమాద వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఉట్నూర్ మండలంలోని కొమ్ముగూడలో, ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ప్రజలకు రోగులకు అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా అయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే తమకు సమాచారం అందించాలని అన్నారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముంబైలో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో అగ్నిమాపక సిబ్బంది అమరులు కావడంతో వారికి సంతాపకంగా నివాళులర్పిస్తూ అగ్ని ప్రమాద వారోత్సవాలను నిర్వహిస్తున్నామని రాజలింగు వివరించారు. ఈ కార్యక్రమంలో రమాకాంత్, వేణు, రవీందర్, అంజనేయులు, మాణిక్‌రావు, శ్యాం కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ హయాంలోనే సంక్షేమం'

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 17: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే సంక్షేమ పథకాలు అన్ని వర్గాలకు అందుతున్నాయని, ప్రతిఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం మండలంలోని మోర్కండి, దేగామ, భూతాయి ఉమ్మడి గ్రామ పంచాతీల పరిధిలో గల ఆయా గ్రామాలలో ఆమె పర్యటించారు. ఆది వాసీ గ్రామాలలో తిరుగుతూ వారి సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారం కోసం తనవంతుగా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళలకు పెద్దపీట వేస్తూ మహిళల అభివృద్ధి కోసం పాటుపడుతోందన్నారు. అందులో భాగంగానే ఆదిలాబాదు పార్లమెంటు అభ్యరిగా తనను బరిలో దించారని తెలిపారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లోపే అమలు చేసి ప్రతీఒక్కరికి సంక్షేమ ఫలాలను అందజేస్తోందన్నారు. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. అందుకే పార్లమెంటు ఎన్నికలలో మహిళా అభ్యర్థి అయిన తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జీ ఆడె గజేందర్, జడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, మండల కన్వినర్ జల్కె పాండురంగ్, మాజీ ఎంపీటీసీ కానిందె ఉద్ధవ్, పసుల చంటి, బత్తిని కిషన్, కల్లెం విఠల్, ఇస్తారి, నర్సయ్య, దేవన్న, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'త్వరలోనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ'

తలమడుగు, ఏప్రిల్ 17: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, పదవుల కోసం బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చెప్పే మాయమాటలకు ఎవరు మోస పోవద్దని జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని దేగామ, ఉమ్రి గిరిజన గ్రామాల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలను నెరవేర్చిందన్నారు. అంతేకాకుండా త్వరలోనే రైతులకు 2లక్షల రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ ఇప్పించడం జరిగిందన్నారు. అభివృద్ధి చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. ఇందులో ఎంపీపీ కళ్యాణంలక్ష్మి రాజేశ్వర్, నాయకులు ఈ ప్రకాష్‌రావు, బి.బాబన్న, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి బ్రహ్మోత్సవాల పోస్టర్ల విడుదల

ఉట్నూర్, ఏప్రిల్ 17: ఈ నెల 22 నుంచి 25 వరకు సిరికొండ మండలం వాయిపేటలో జరుగనున్న మహంకాళి బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ ఆవిష్కరించారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జైమహంకాళి సొసైటీ సభ్యులతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు కోట్నాక్ దినేష్‌కుమార్, ఇస్రు, కాంగ్రెస్ నాయకులు కయ్యుం చంద్రయ్య, ఇక్బాల్, పరమేశ్వర్‌రావు, సలీం, రాజేశ్వర్, మోబిన్, ఇమ్రాన్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

● పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్దసంఖ్యలో భక్తులు ● ఆదిలాబాద్‌లో జిల్లాలో ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 17: అందరికి సమన్యాయం చేయగల వ్యక్తి శ్రీరాముడని, ఆయన అడుగుజాడల్లో ప్రజాసేవల్లో పాల్గొంటున్నామని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని రణదివ్యనగర్, కొలిపుర, రాంనగర్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉట్నూర్: మండలకేంద్రంలోని పాత ఉట్నూర్ సమీపంలో కాకతీయుల నాటి శ్రీసీతారాముల ఆలయ ప్రాంగణంలో శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం శ్రీసీతారాముల కల్యాణం శోభయమానంగా జరిగింది. బోయవాడకు చెందిన పార్వంది శివకుమార్ దంపతులు బ్యాండ్ మేళాలతో సీతమ్మ వారి తరపున నూతన వస్త్రాలు, నగలు తీసుకొని రాగా.. రామ్‌నగర్ ప్రాంగణంలో ఉన్న హనుమాన్ మందిరంలో ఉత్సవ విగ్రహాలకు పూజలు చేసిన అనంతరం అక్కడి నుంచి ర్యాలీ ద్వారా మండపానికి విగ్రహాలను తీసుకువచ్చారు. వేద పండితులు సంతోష్‌దుబే ఆధ్వర్యంలో వైభవంగా శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించారు.

నేరడిగొండ: మండల కేంద్రంతో పాటుకుమారి, వడూర్, తేజపూర్, వాంకిడి, తదితర గ్రామాలలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలను జరుపుకున్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మండలలోని కుమారి గ్రామంలో ఉన్న సద్గురు శ్రీశబరిమాత ఆశ్రమాన్ని శ్రీరామనవమి సందర్బగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, మండల కేంద్రంలో గల శబరిమాత ఆశ్రమంలో శ్రీరాముల వారి విగ్రహ ఎదుర్కొలు కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుగు పతంగే బ్రహ్మానందం, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జైనథ్ రూరల్: మండలంలోని లక్ష్మీపూర్, ఆనంద్‌పూర్, దీపాయిగూడ, సాత్నాల, జైనథ్ తదితర గ్రామాలతో పాటు మండలంలోని బోరజ్, పిప్పర్‌వాడ రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలను బుధవారం మహిళల, భక్తులు, ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సీతరాములతో పాటు లక్ష్మణుడు, హనుమాన్ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించారు. ఈ సందర్భంగా సీతారాముడి విగ్రహాలను మంగళహారతులతో డప్పులు భజాల మధ్య పల్లకిలో ఊరేగించారు. సీతారాముడి ఉత్సవ విగ్రహాలను అలంకరించి వేది పండితుల

తలమడుగు: శ్రీరామ నవమిని పురస్కరించుకొని మండలంలోని కజ్జర్ల రామాలయం సుంకిడి రామాలయం,దేవాపురం హనుమాన్ ఆలయంలో కుచ్లాపూర్ సాయిబాబా ఆలయంలో కమనీయంగా సీతారాముల కళ్యాణాన్ని కనునల పండుగ వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య ఘనంగా కళ్యాణాన్ని నిర్వహించారు. బుధవారం మండలంలోని కుచ్లాపూర్ గ్రామంలో శ్రీరామనవమి సుందర్భంగా సాకటి దశరథ్, బీజేపీ శ్రేణులు రాముని విగ్రహ శోభయాత్రను నిర్వహించారు.

తాంసి: శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన సీతారాములకు కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. మండల కేంద్రంలోని రామేశ్వరాలయంలో, హస్నాపూర్ గ్రామంలోని రామాలయంలో, బండల్నాపురంలోని కోదండర రామాలయంలో కపర్లలోని రామ మందిరంలో ఈ కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు.



ఉట్నూర్‌లో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ దంపతులు, మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్

ఇంద్రవెల్లి: మండలంలోని గ్రామాల్లో శ్రీరామ నవమి పర్వదినాన్ని బుధవారం భక్తి శ్రద్దలతో నిర్వహించారు. మండల వ్యాప్తంగా పలు ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు చేశారు. మండలంలోని ముత్నూర్ గ్రామంలో కాషాయ జెండాను ఆవిష్కరించి శ్రీరాముని చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేశారు.

భీంపూర్: మండలంలోని పిప్పల్‌కోటి, నిపాని, దన్నోరా, వాడూర్, అర్లి (టి) అంతర్గాం, గోముత్రి, కరంజి(టి) గూబ్డి తదితర గ్రామాల ఆలయాల్లో బుధవారం సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం శోభాయాత్రను నిర్వహించారు.

గుడిహత్నూర్: శ్రీరామ నవమి వేడుకలు బుధవారం మండలంలో భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు.

అలాగే, ఇచ్చోడ, బోథ్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.



నేరడిగొండలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్



భక్తులతో కిటకిటలాడుతున్న పిప్పర్‌వాడ రామాలయం



కప్పర్లలో సీతారాములకు పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న భక్తులు

'శనగల డబ్బులను విడుదల చేయాలి'

తాంసి, ఏప్రిల్ 17: శనగలు అమ్మి నెల రోజులు కావస్తున్నా ఇంకా తమ ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని శనగ రైతులు ఆందోళన వ్యక్తం స్తున్నారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు రైతులు తమ మొర వినిపించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శనగ అమ్మిన రైతులకు డబ్బులు జమ చేయాలని కోరారు.

వడదెబ్బతో ఒకరి మృతి

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 17: మండల కేంద్రంలోని ప్రబుద్ద నగర్ కాలనీకి చెందిన సాల్వే సంబా(48) వడదెబ్బకు గురై బుధవారం సాయంత్రం మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సాల్వే సంబా తన వృత్తి మోటార్ మెకానిక్‌గా పనులను ముగించుకుని మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చి పడుకుని అస్వస్థతకు గురయ్యాడని, ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారు ఇంటికి వచ్చిన కొద్ది సేపటికే మృతి చెందినట్లు గ్రామస్థులు వివరించారు.

● ట్రాక్టర్ పైనుంచి పడి డ్రైవర్..

ఇచ్చోడ: సిరిచెల్మ గ్రామం నుంచి ట్రాక్టర్‌లో ఇటుకను లోడ్ చేసుకుని ముక్రా గ్రామంలో ఇటుక లోడ్‌ను ఖాళీ చేసి తిరిగి సిరిచెల్మ వెళ్తుండగా మార్గమధ్యంలో చించోలి క్రాస్ రోడ్డు వద్ద అదుపుతప్పి ట్రాక్టర్ పైనుంచి పడి డ్రైవర్ రాజేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో కిందపడి మృతి చెందాడని, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

'అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం'

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 17: ఆదిలాబాద్‌లో నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల బూత్ స్థాయి సమావేశంలో మాజీ మంత్రి కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ తీరుపై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల తర్వాత బీజేపీలో చేరుతారని పదేపదే బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేయడం మానుకోవాలని హెచ్చరించారు. అధికారం కోల్పోయాక జీర్ణించుకోలేకనే అసహనంతో ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారంటూ ఆరోపించారు. చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికే కాంగ్రెస్‌పై లేనిపోని ఆరోపణలు చేసి వచ్చే ఎన్నికల్లో మళ్లీ లబ్ధి పొందడానికి యత్నిస్తున్నారని మండిపడ్డారు. ఇందులో డీసీసీబీ ఛైర్మన్ అడ్డిభోజారెడ్డి, తలమడుగు జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, తదితరులున్నారు.

● 'కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం'

తలమడుగు: తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, పదవుల కోసం బీఆర్ఎస్ బీజేపీ పార్టీల నాయకులు చెప్పే మాయ మాటలకు ఎవరు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే బొజ్జుపటేల్ అన్నారు. బుధవారం మండలంలోని పల్లి(బి) గ్రామ మాజీ సర్పంచ్ కుమ్రమల్కు పటేల్, సొసైటీ డైరెక్టర్ లోకలింగారెడ్డి గార్లని కాంగ్రెస్ పార్టీకి ఆహ్వానించి ఎమ్మెల్యే వెడ్మబొజ్జు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.

ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 17: శ్రీరామనవమిని పురస్కరించుకుని ప్రతియేడు హిందూ వాహిని సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీరాముని శోభాయాత్రను బుధవారం జిల్లాకేంద్రంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పాయల శంకర్ శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం మఠాధిపతి శ్రీయోగానంద సరస్వతి స్వామితో కలిసి శోభయాత్రను ప్రారంభించారు. ఇందులో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్, హిందు వాహిని సంఘాల నాయకులు రాళ్లబండి మహేందర్, సురేందర్, మనోజ్ పవార్, చిట్యాల సుహాసినిరెడ్డి, కార్తిక్, బీజేపీ కార్యకర్తలు, నాయకులు, తదితరులున్నారు.



గోపాలకృష్ణ మఠం నుంచి శోభయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

భక్తి,శ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు



కుభీర్‌లోని శివాలయంలో సీతారాముల కల్యాణం

కుభీర్, ఏప్రిల్ 17 : మండల కేంద్రంతో పాటు మండంలోని పార్డి(బి), పల్సి, మాలేగాం, సొనారి, నిగ్వా తదితర గ్రామాల్లో బుధవారం శ్రీరామ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం గ్రామాల్లో ఆలయాల్లో ప్రత్యేకపూజలు చేశారు. మండల కేంద్రంలోని శివసాయి ఆలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు మంగళహారతులతో వచ్చి సీతారాముల కల్యాణం కార్యక్రమంలో పాల్గొని పెద్దఎత్తున భజనలు, భక్తి సంకీర్తనలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురోహితులు ఈరలింగం, ఆలయ కమిటీ నాయకులు నర్సప్ప, ప్రతాప్‌సింగ్, బోయిడి దత్తాత్రి, నగభూషణ్, ఎన్నిక అనీల్, రాందాస్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



కోలూర్‌లో రామనవమి వేడుక నిర్వహిస్తున్న దృశ్యం

తానూర్ : మండల కేంద్రం తానూర్‌తో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం శ్రీరామ నవమిని ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరాముని జన్మదిన వేడుకలను నిర్వహించి, అనంతరం సీతారాముల కల్యాణం కన్నుల పండవగా జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



కల్లూరు సాయిబాబా ఆలయంలో సీతారాముల కల్యాణం

కుంటాల : కుంటాల మండలంలోని కల్లూరు దత్త వెంకటసాయి మందిరంతో పాటు కుంటాల ప్రాచీన శ్రీకృష్ణ దేవాలయం తదితర ఆలయాల్లో బుధవారం శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూర్ దత్త వెంకటసాయి మందిరంలో గత ఏడు రోజుల క్రితం ప్రారంభించిన ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి సాయినామ సప్తాహం సమాప్తి, సీతారాముల కల్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలం నలుమూలల నుండి ప్రజలు అధికసంఖ్యలో హాజరయ్యారు. హాజరైన భక్తులకు తాగునీరు. అన్నదానం తదితర ఏర్పాట్లు చేశారు.



శ్రీరామ డోలారోహణోత్సవంలో ఎమ్మెల్యే రాంరావు

భైంసా రూరల్ : మండలంలోని కామోల్, ఎగ్గాం, మహాగాం, వానల్‌పాడ్, దేగాం గ్రామాల్లో బుధవారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి పురస్కరించుకొని ఉదయం నుంచి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది సీతారాముల విగ్రహాలను అందంగా ముస్తాబు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణం మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాంరావు పటేల్, వీడీసీ సభ్యులు, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి) : మండల కేంద్రంతో పాటు రాంపూర్, గొల్లమాడ, డొంగుర్‌గాం, గొల్లమాడ ఆయా గ్రామాలలో బుధవారం శ్రీరామ నవమి వేడుకలను భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు.



జామ్ రామాలయంలో మొక్కులు మొక్కుతున్న బీజేఎల్పీ నేత

సారంగాపూర్ : మండలంలోని జామ్‌లో గల పట్టాభి సీతా రామాలయంలో, స్వర్ణలో గల కోదండ రామాలయంలో బుధవారం సీతారాముల కల్యాణోత్సవాన్ని గ్రామాల అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవ కార్యక్రమానికి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డితో పాటు మాజీ ఎంపీ జి.నాగేష్‌లు హాజరై ఆలయాల్లో మొక్కులను మొక్కారు. ఈ నేపథ్యంలో ఆలయ పూజారి ప్రత్యేకపూజలు చేసి హారతినిచ్చి తీర్థ ప్రసాదాలను అందించారు.

ముథోల్ : మండల కేంద్రమైన ముథోల్‌లో బుధవారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలోని రామమందిరంలో వేద పండితులు అభిషేకం, అలంకరణతో పాటు కల్యాణం మహోత్సవం నిర్వహించి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం గ్రామస్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనంలో శ్రీరాముడి ప్రతిమతో శోభాయాత్ర చేపట్టారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.



ముథోల్‌లో శ్రీరాముడి శోభాయాత్ర



గంగాహారతి పూజ ప్రారంభం

బాసర, ఏప్రిల్, 17 : బాసర సరస్వతి దేవస్థాన ఆధ్వర్యంలో గోదారమ్మకు బుధవారం గంగాహారతి పూజ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ పండితులు, వేదపండితుల మంత్రోశ్చరణాల మధ్య గోదారమ్మకు హారతిపూజను ఘనంగా నిర్వహించారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారంలో ఒకరోజు నది హారతి పూజలు జరపాలని ఆదేశాలు ఉన్నాయి. ఆలయ వైదిక సిబ్బంది ప్రతి బుధవారం నది హారతిపూజ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు మొదటి రోజు బుధవారం పూజలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో విజయ రామారావు, వైదిక సిబ్బంది, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నయనానందం సీతారాముల కల్యాణం

- జిల్లాలోని వైష్ణవాలయాల్లో వైభవంగా సీతారామకల్యాణం • భారీసంఖ్యలో పాల్గొన్న భక్త జనం • నిర్మల్,భైంసా పట్టణాల్లో శ్రీరామ భారీ ప్రతిమతో శోభాయాత్ర • మార్మోగిన రామనామం • పులకించిన భక్త జనం • పాల్గొన్న ప్రముఖులు • భారీ ఎత్తున ప్రసాద వితరణలు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 17 : శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా జిల్లాలోని పలు ఆలయాల్లో సీతారామకల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. భైంసాలో, జిల్లా కేంద్రంలో శ్రీరాముడి భారీ ప్రతిమతో శోభాయాత్ర నిర్వహించారు. స్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని డోలారోహణ కార్యక్రమాలు పలు ఆలయాల్లో చేపట్టారు. జిల్లా కేంద్రంలోని బాగులవాడ వాల్మీకినగర్‌లో, బ్రహ్మపురి, శాంతినగర్ శ్రీరామాలయంలో సీతారామకల్యాణం జన సందోహం మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు హాజరై కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. జైశ్రీరామ్ అంటూ భక్తుల నినాదాలు మిన్నంటాయి. ఆలయ నిర్వాహక కమిటీలు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసి అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి దేవరకోటలో శ్రీరాముడి విగ్రహానికి ప్రత్యేకపూజలు చేశారు. హిందూవాహిని ఆధ్వర్యంలో శోభాయాత్ర ప్రారంభించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శ్రీరాముడి కల్యాణాన్ని రాష్ట్రంలో చూసేందుకు ఎన్నికల పేరుతో ఎన్నికల సంఘం అడ్డుకుంటోందన్నారు. కొన్ని రాజకీయ పార్టీల ఒత్తిడి వల్ల ఈ చర్య తీసుకోవడం బాధాకరమన్నారు. హిందూవాహిని నాయకులు డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డి, బీజేపీ ప్రధాన కార్యదర్శి మేడిసెమ్మె రాజు, తదితర నాయక గణం పాల్గొన్నారు.

జిల్లా డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు జిల్లా కేంద్రంతో పాటు నర్సాపూర్ మండలంలో జరిగిన కళ్యాణోత్సవానికి హాజరై శ్రీరాముడిని దర్శించుకున్నారు. ప్రజలందరూ శ్రీరాముడి ఆశీస్సులతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ గణేష్, ఆయా ప్రాంత నాయకులు పాల్గొన్నారు.

కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్, కద్తాల్ గ్రామంలోని రామాలయంలో జరిగిన సీతారామ కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే ఏలేటి సతీమణి కవితారెడ్డి హాజరయ్యారు. నాయకులు మార గంగారెడ్డి, హరీష్‌రెడ్డి, గంగన్న, అంజయ్య, తదితరులు ఆయన వెంట ఉన్నారు.

అడుగడుగునా జై శ్రీరామ్ నినాదాలు

జిల్లాకేంద్రంలో హిందూవాహిని ఆధ్వర్యంలో శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం నిర్వహించిన శ్రీరాముడి శోభాయాత్ర కన్నుల పండువగా జరిగింది. ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి శోభాయాత్ర ప్రారంభించగా శ్రీరాముడి విగ్రహంతో నిర్మల్ పురవీధుల గుండా కొనసాగింది. అడుగడుగునా జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగాయి. శోభాయాత్రలో పాల్గొన్న భక్తజనం పులకించిపోయారు. అడుగడుగునా గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించి ఎస్పీ జానకి షర్మిల శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

దిలావర్‌పూర్ : మండల కేంద్రంలోని శ్రీ రామాలయంలో బుధవారం శ్రీసీతారాముల కల్యాణం మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అంతకుముందు బాలరాముడికి బారసాల నిర్వహించి పండితులు సీతమ్మ వారితో రామయ్యకు కల్యాణం చేశారు. ఎదుర్కోలు తంతు భక్తులను ఆకట్టుకుంది. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అక్షర అనిల్, మాజీ సర్పంచ్ వీరేష్ కుమార్, ఎంపీటీసీ గంగవ్వ ముత్యం రెడ్డి, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


శాంతినగర్ ఆలయంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు


దస్తూరాబాద్‌లోని గీతామందిరంలో కళ్యాణం

మార్మోగిన శ్రీరామనామం

- హిందూవాహిని ఆధ్వర్యంలో భారీ శోభాయాత్ర
- మంగళహారతులతో స్వాగతం పలికిన మహిళలు

భైంసా : పట్టణంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించు కొని పట్టణ పరిధిలో హిందూవాహిని శ్రేణులు శ్రీరాముని, భారతమాత విగ్రహాలతో భారీ శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక గోశాల నుంచి ప్రారంభమైన శోభాయాత్ర పురాణాబజార్, బ్రహ్మణ్‌గల్లి, భట్టిగల్లి, గణేష్ నగర్, పద్మావతి నగర్ కాలనీల మీదుగా ప్రధాన రోడ్డు మార్గంలో శివారు ప్రాంతంలోని రామ్‌లీల మైదానం వరకు కొనసాగింది. ఉదయం వేళలో ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్, జిల్లా ఎస్పీ షర్మిల్ జానకీ, ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, బీజేపీ ఆదిలాబాద్ లోక్‌సభ అభ్యర్థి గెడం నగేష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోస్లే మోహన్‌రావ్ పాటిల్, నగర్ నారాయణ రెడ్డి, విశ్వహిందు పరిషత్ ప్రతినిధులు డా.మహిపాల్, గుజ్జల్‌వార్ వెంకటేష్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు సాధుల కృష్ణదాస్, సరుకొం దామోదర్, ఆరోగ్య భారతి ప్రతినిధి డా.రామకృష్ణగౌడ్, హిందువాహిని ప్రతినిధులు పూజలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించారు. ఆయా కాలనీలకు చేరుకున్న శోభాయాత్రకు అక్కడి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. భవనాలపైనుంచి శ్రీరాముని విగ్రహంపై పూలు చల్లారు. శోభాయాత్రలో హిందూవాహిని, ఆర్ఎస్ఎస్, విశ్వహిందుపరిషత్, భజరంగ్‌దళ్, గోరక్షదళ్, బీజేపీ శ్రేణులతో పాటు డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువకులు అధికమొత్తంలో పాల్గొన్నారు. డీజే సౌండ్‌కు అనుగుణంగా యువకులు నృత్యాలు చేస్తూ శోభాయాత్రకు వన్నె తెచ్చారు.

భారీ పోలీసు బందోబస్తు

శ్రీరామనవమి వేడుకలలో భాగంగా భైంసాలో హిందూవాహిని ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రకు పోలీసుశాఖ భారీ బందోబస్తు చేపట్టింది. భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆధ్వర్యంలో టౌన్ సీఐ రాజారెడ్డి భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ జానకీ షర్మిల భైంసాలో పర్యటించి బందోబస్తును పర్యవేక్షించారు, పట్టణాన్ని నాలుగుజోన్లుగా విభజించి భద్రత చర్యలను చేపట్టారు. బందోబస్తులో 4 సీఐలు, 11 ఎస్ఐలు, 5 ఏఎస్ఐలు, 11 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 100 మంది పోలీసు కానిస్టేబుళ్లు, ప్రత్యేక పోలీసు బలగాలు, క్యూఆర్‌టీ టీములు పాల్గొన్నాయి. వివాస్పద, సమస్యాత్మక ప్రాంతాలతో పాటు ఆలయాలు, ప్రార్థన మందిరాల వద్ద ప్రత్యేక బందోబస్తు చేపట్టారు. పట్టణంలో 4 పోలీసు పికెట్లతో పాటు బందోబస్తు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 2 మొబైల్ టీంలు నిరంతరం బందోబస్తును పర్యవేక్షించాయి.

ఖానాపూర్ : శ్రీరాంనగర్ కాలనీలో గల ఈ సీతారామాంజనేయ స్వామి ఆలయంలో, మస్కాపూర్‌లోని రామాలయంలో, కడెం మండల కేంద్రంలోని రామాలయంలో, సారంగాపూర్‌లోని రామాలయాలలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన సీతారాముల కల్యాణం కన్నుల పండువగా సాగింది. ఖానాపూర్‌లోని అతి పురాతనమైన శ్రీ సీతారామ ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన సీతారామ కల్యాణం వేడుకలను తిలకించేందుకు మండల నలుమూలల నుండి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. వేద పండితులు కీర్తి రాఘవశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణం ఘట్టాన్ని తిలకించి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు ఖానాపూర్ శ్రీరాంనగర్‌లోని సీతారామాంజనేయ ఆలయ పునర్నిర్మాణం కోసం ఆలయ ఆవరణలో భూమి పూజ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ సత్యం, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్‌నాయక్, స్థానిక కౌన్సిలర్లు జన్నారపు విజయలక్ష్మి శంకర్, నాయిని స్రవంతి సంతోష్, మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మంత్రరాజం సురేష్, వ్యవస్థాపక అధ్యక్షులు అల్లాడి వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు జనార్ధన్, కిషన్, రాకేష్, శ్రీనివాస్, తదితరులున్నారు.

దస్తూరాబాద్ : మండల కేంద్రంలోని గీతామందిరంలో, మండలంలోని రేవోజీపేట్ గ్రామంలోని రామాలయంలో, దేవునిగూడెం, పెర్కపల్లె, మున్యాల్, భూత్కూర్ గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేదమంత్రాలతో శ్రీసీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. రేవోజీపేట్ గ్రామంలో స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం స్వాములు ఆయా గ్రామాల్లో రామ, హనుమ నామస్మరణలతో పలు వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు.


చామన్‌పెల్లిలో సీతారాముల కల్యాణం

సాయంత్రం ఆయా గ్రామాల్లో పలు వీధుల గుండా శ్రీ సీతారాముల పల్లకీని తీశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : మండలంలోని ఆయా గ్రామాల్లో గల రామాలయాలలో శ్రీరామ నవమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. చామన్‌పెల్లి, పీచర, వడ్యాల్ తదితర గ్రామాల్లో గల ఈ ఆలయంలో ప్రత్యేకపూజలు, యజ్ఞాలు, శోభాయాత్రలు నిర్వహించారు. అనంతరం 'సీతారాముల కల్యాణం మహోత్సవం' అంగరంగ వైభవోపేతం జరిపారు. ఈ కార్యక్రమానికి నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సతీమణి ఏలేటి కవితారెడ్డి, నాయకులు అయిండ్ల భూపాల్‌రెడ్డి, అడ్వాల రమేష్, సురకంటి ముత్యం రెడ్డి, తదితరులతో పాటు ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, ప్రజలు, నాయకులు హాజరయ్యారు.


శోభాయాత్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

పిడుగుపాటుకు మహిళా రైతు మృతి

- కడెం మండలం సింగాపూర్ తండాలో విషాదం


లక్ష్మి మృతదేహం..


లక్ష్మి (ఫైల్)

ఖానాపూర్, ఏప్రిల్ 17 : పిడుగుపాటుకు మహిళా రైతు మృతి చెందిన ఘటన కడెం మండలం సింగాపూర్ తండాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కడెం ఎస్సై కృష్ణసాగర్ రెడ్డి తెలిపిన కథనం ప్రకారం... సింగాపూర్ తండాకు చెందిన రామెల లక్ష్మి(40) అనే మహిళా రైతు బుధవారం తమ వ్యవసాయ భూమిలోకి పని చేసేందుకు వెళ్లింది. సాయంత్రం ఐదు గంటల సమయంలో ఒక్కసారిగా వర్షం జల్లులు రావడంతో లక్ష్మి దగ్గరలో ఉన్న వేప చెట్టు కింద తలదాచుకునేందుకు వెళ్లింది. దీంతో వేపచెట్టుపై పిడుగుపడటంతో లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. పొలం నుండి ఇంటికి వచ్చిన భర్త చిన్న పోశెట్టి తన భార్య లక్ష్మి ఇంకా ఇంటికి తిరిగి రాకపోవడంతో పొలం వద్దకు వెళ్లి చూడడంతో లక్ష్మి తమ వ్యవసాయ భూమిలో ఉన్న వేప చెట్టు కింద విగతజీవిగా పడి ఉండడం గమనించాడు. దీంతో దగ్గరకు వెళ్లి చూసి గ్రామస్థులకు తెలపడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి భర్త పోశెట్టి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. మృతి చెందిన లక్ష్మికి భర్త పోశెట్టి, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. పిడుగుపాటుతో లక్ష్మి మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఈవీఎంలు వచ్చేశాయ్..



ముథోల్, ఏప్రిల్ 17 : ముథోల్ స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలు వచ్చాయి. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు మంగళవారం రాత్రి జిల్లా కేంద్రం నుంచి ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన యంత్రాలు బందోబస్తు మధ్య ముథోల్‌కు చేరుకున్నాయి. ముథోల్ నియోజకవర్గ పరిధిలోని 311 పోలింగ్ బూత్‌లకు సంబంధించి వీవీ ప్యాడ్స్ 417, ఈవీఎంలు 388, బ్యాటరీ, అదనపు సామాగ్రిని జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక వాహనాల్లో నుంచి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు.

మూగజీవుల దాహార్తి తీర్చేందుకు నీటితొట్టిల ఏర్పాటు


తొట్టిలో నీటిని తాగుతున్న మేకలు


గీత పారిశ్రామిక సహకార సంఘం ముందరి భాగంలోని నీటి తొట్టి

భైంసా, ఏప్రిల్ 17 : మండుతున్న ఎండల దాటికి విలవిలలాడుతూ నీటి కోసం పరితపిస్తున్న మూగజీవాలపై పట్టణంలోని రెండు సంస్థలు చల్లని చూపును చూపుతున్నాయి.స్థానిక ప్రధాన రోడ్డు మార్గంలోని నరసింహ జిన్నింగ్ ఫ్యాక్టరీ నిర్వాహకులు, గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు గాను ప్రత్యేక చర్యలు చేపట్టాయి. వాటి దాహార్తిని తీర్చేందుకు గాను తమ సంస్థల ముందు బాగంలోనున్న నీటి తొట్టిలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకవచ్చాయి. నెల రోజులుగా తొట్టిలలో అన్ని వేళల నీటిని నింపుతూ మూగజీవాల దాహార్తిని తీరుస్తున్నారు.సుద్దవాగు పరిసర ప్రాంతాలతో పాటు శివారు ప్రాంతాల్లోకి మేత కోసం వేళ్లే మూగజీవాలు ఉదయం, సాయంత్రం వేళలో రెండు సంస్థల ముందు భాగంలో గల తొట్టిలలోని నీటిని సేవిస్తూ దాహార్తిని తీర్చుకుంటున్నాయి. రోడ్లపై సంచరించే పశువులు అన్ని వేళల్లో ఈ తొట్టిలలోని నీటిని సేవిస్తుంటాయి. రెండు సంస్థల నిర్వాహకులు తొట్టిలలో నీటి నిల్వలు ఎప్పుడు ఉండే విధంగా పర్యవేక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోయిన తరుణంలో నీటి ఎద్దడి నెలకొని దాహార్తితో అలమటిస్తున్న మూగజీవాలపై రెండు సంస్థలు చల్లని చూపును చూపాయి.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 17 : ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ తెలంగాణ చిత్తశుద్ధితో కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షులు యాటకారి సాయన్న పేర్కొన్నారు. బుధవారం సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్. శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బి. చంద్రకాంత్‌లను నియమిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్వతి సత్యనారాయణ జారీ చేసిన నియామక పత్రాలను సాయన్న అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర సంఘం ప్రాతినిధ్యం మేరకు ప్రభుత్వ ఉపాధ్యాయులకు నూతన పీఆర్సీ అమలు, భాషా పండితుల పదవీ ఉన్నతీకరణ, 317 జీవో కారణంగా ప్రస్తుతం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకరించడం జరిగిందన్నారు. స్థానికంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడం జరుగుతుందన్నారు. సంఘ విస్తరణకు ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకోవడానికి త్వరలోనే వ్యక్తిగతంగా కలవడం జరుగుతుంద న్నారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్. శ్రీనివాస్, సభ్యులు పెద్దకాపు సత్యనారాయణ, సాయన్న, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


నియామకపు పత్రాలను అందజేస్తున్న దృశ్యం

టెట్ ఉచిత శిక్షణ ప్రారంభం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 17 : నిర్మల్‌లోని ఈద్గామ్ ఉన్నత పాఠశాలలో 2024 టెట్ ఉచిత శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ ఓయూ నిజాం కాలేజీ మైనారిటీ వెల్ఫేర్ శాఖ ఉచిత శిక్షణ నిర్వహిస్తోంది. కోఆర్డినేటర్ అన్సార్ అహ్మద్ సాహిల్, ఎస్టీయూ నాయకులు గజేందర్, జే. లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు. మైనారిటీ విద్యార్థులు ఈ తరగతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కుబీర్, ఏప్రిల్ 17 : మండలంలోని సొనారి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు గురువారం ఉదయం 8గంటల నుండి 6గంటల వరకు కరెంటులో అంతరాయం కలుగనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సొనారి 11కేవీ సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ పీటీఆర్‌ను తీసేసీ 8ఎంవీఏ పీటీఆర్‌ను అమర్చడం జరుగుతుందని, ఈ మరమ్మత్తుల దృష్ట్యా అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

ఎన్నికల నిర్వహణపై ఎస్ఈసీ వీడియో కాన్ఫరెన్స్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 17 : పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశిస్తూ బుధవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వికాస్ రాజ్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హాజరయ్యారు. గురువారం నుండి ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. నామినేషన్ల స్వీకరణలో అనుసరించాల్సిన విధివిధానాలు తెలియజేశారు. ఓటరు కార్డులో మార్పు, చేర్పు, పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు, తదితర వాటిపై దిశానిర్దేశం చేశారు. అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీజేపీలో చేరిక

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 17 : ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మాజీ మంత్రి వ్యక్తిగత సోషల్ మీడియా కన్వీనర్ ఆరె అన్వేష్ బీజేపీలో చేరారు. మహేశ్వర్ రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జట్టు దినేష్, ఏ. శ్రీకాంత్ రెడ్డి, విజయ్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

మండల కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం ఎన్నిక

దిలావర్‌పూర్, ఏప్రిల్ 17 : కాంగ్రెస్ పార్టీ మండల కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా తక్కల విద్యాసాగర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా దమ్మ రవీందర్‌రెడ్డి, సయ్యద్ యూసుఫ్, ప్రధాన కార్యదర్శిగా ఆర్షుల రమణ, కోశాధికారిగా కోడె శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా నిమ్మ సాయన్న, బి.రాజు, నరేష్, మరో తొమ్మిది మందిని కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ అనుబంధ సంఘాల కార్యవర్గాలు

కాంగ్రెస్ అనుబంధ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎస్కే షఫీ, ప్రధాన కార్యదర్శిగా ఎస్కే సలీం, బీసీ సెల్ అధ్యక్షుడిగా తెడ్డు గోపాల్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బొల్ల దయాకర్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా తోట మహేష్, కిసాన్‌సెల్ అధ్యక్షుడిగా పరుశురాం పటేల్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల అధ్యక్షుడు విద్యాసాగర్ రెడ్డి ప్రకటించారు.

కళాకారులకు సన్మానం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 17 : ఇటీవల నిర్మల్‌లో ప్రదర్శించిన మా ఊరి రాజారెడ్డి మూవీ చిత్రంలో నటించిన ఎర్ర రవీందర్, ఏ. వెంకటరమణను టీఎన్జీవోల సంఘ భవనంలో బుధవారం సన్మానించారు. తెలంగాణ మూవీ అండ్ టీవీ ఆర్టిస్టుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ... నిర్మల్ పరిసరాల్లో చిత్రీకరించడం దానికి గుర్తింపు లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.